క్లుప్తంగా

గోరుముద్ద మెనూ కచ్చితంగా అమలు చేయాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీపీ సత్యవంతుడు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బయోమెట్రిక్‌లను పరిశీలించారు. పాఠశాలలో వసతులు, బోధనపై ఆరాతీశారు. ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాకానుక కిట్లు అందరికీ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అలబోని పైడిబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు


శ్రీరాముని అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి గ్రామంలో అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. సర్పంచ్ కొడెల ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో అక్షింతలను ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. రాములవారికి పసుపు కుంకుమలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార్పు అప్పారావు, బి.జగన్నాథం, కొమ్మినేని బంగారునాయుడు, ఎర్ర చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో తక్కువ వడ్డీకే రుణాలు

గంట్యాడ: డీసీసీబీ బ్రాంచ్‌లలో తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని జనరల్ మేనేజర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. గంట్యాడ బ్రాంచ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. సహకార బ్యాంకులో జీరో బ్యాలెన్స్ ఖాతాలను ఓపెన్ చేయనున్నట్టు తెలిపారు. ఐదువేల ఖాతాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. సహకార బ్యాంకు ఖాతా తెరిచిన వారికి పాస్ బుక్, డెబిట్ కార్డుతో పాటు, లక్ష రూపాయల వరకు ఇన్సూరెన్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఆర్యవైశ్య సంఘం వనసమారాధన


వాసవీ మాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

జామి: మండలంలో కలగాడ గ్రామంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ముందుగా వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

జీడిమామిడి సాగులో సస్యరక్షణ కీలకం

గంట్యాడ: మామిడి, జీడిమామిడి తోటలలో సస్యరక్షణ సకాలంలో చేపట్టాలని రస్తాకుంటుభాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు సూచించారు. మండలంలోని రావివలస గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత, సాగునీరు పరివర్తన పథకం(ఏపీఐఎల్ఐపీటీపీ) ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకం, సస్యరక్షణపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జీడిమామిడి తోటల్లో పూత, పిందెలను కాపాడుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఉద్యానశాఖ ఏడీ శైలజ కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులను వివరించారు. హెచ్ఓ అనిత డ్రిప్, స్ప్రింకర్ల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న వైస్ ఎంపీపీ సుధారాజు

శృంగవరపుకోట: ప్రకాశం జిల్లాలో ఈ నెల 24,25 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు మంగళవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఎమ్మెల్సీ సూచనల మేరకు బొడ్డవరలోని తన నివాసంలో క్రీడాకారులకు రూ.25 వేలు విలువైన దుస్తులు అందజేసినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని వారికి సూచించారు. కార్యక్రమంలో బి.సూర్యనారాయణ రాజు, బ్యాడ్మింటన్ కోచ్ పి.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం కావాలి


కొత్తవలస: ఉత్తరాపల్లిలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధితో పాటు రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు సీఎంగా కావాలో వివరిస్తున్నారు. గ్రామ సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తవలస మండలం ఉత్తరాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ, అభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పతకాలు కొనసాగాలన్నా.. రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలన్నా మళ్లీ జగనే సీఎం కావాలని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


లక్కవరపుకోట: తామరాపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ


జామి: కలగాడలో సంక్షేమ పథకాల డాష్‌బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరయు, పార్టీ మండల కన్వీనర్ రవికుమార్


వేపాడ: కుమ్మపల్లిలో సంక్షేమ డాష్‌బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ అరుణ, తదితరులు


బొండపల్లి: కొండకిండాంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్య ప్రకాశరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంనాయుడు


గంట్యాడ: రేగుబిల్లిలో డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నర్సింహమూర్తి


చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం తొండ్రంగిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు


మెంటాడ: గజపతినగరం మండలం జిన్నాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న పార్టీ నాయకులు


చీపురుపల్లి రూరల్: పెదనడిపల్లిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు


గుర్ల: నాగళ్లవలసలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు

రైతులకు అండగా ప్రభుత్వం

దత్తిరాజేరు: రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ గేదెల సింహాద్రినాయుడు అన్నారు. దత్తిరాజేరు ఆర్‌బీకే వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీనుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని అన్నారు. ధాన్యం విక్రయించే రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఏఓ అనురాధ, పీఏసీఎస్ కార్యదర్శి బలరాం, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

దత్తిరాజేరు: రైతులు మిల్లులకు ధాన్యం తీసుకునివచ్చినపుడు వారిని ఇబ్బంది పెట్టొద్దని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం సేకరించాలని సూచించారు. ఏఓ అనురాధ మాట్లాడుతూ.. ప్రతీ ధాన్యం గొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రక్ షీట్ ఇస్తారని, మిల్లర్లు కూడా రైతులకు సహకరించాలని కోరారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సింహాద్రినాయుడు, తదితరులు

మస్తర్లు, కొలతల్లో తేడాలపై పీడీ ఆగ్రహం


ఉపాధి పనుల రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

గుర్ల: ఉపాధిహామీ వేతనదారుల మస్తర్లు, పనుల కొలతల్లో తేడాలు ఉండటంపై ఉపాధిహామీ పథకం పీడీ ఉమాపరమేశ్వరి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. తెట్టంగి, పున్నపురెడ్డిపేట, ముద్దాడపేట, ఆనందపురం, రాగోలు గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయలేదని సామాజిక తనిఖీల్లో గుర్తించారు. దీనిపై స్పందించిన పీడీ తక్షణమే బోర్డులు ఏర్పాటు చేయాలని ఏపీఓ కామేశ్వరరావును ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ కల్యాణి, నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారు నాయుడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా..

శృంగవరపుకోట: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ, జోనల్ కమిటీ పిలుపుమేరకు మంగళవారం ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ కార్మికులు ఆందోళన చేపట్టారు. భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.ఎస్.రాజు, డిపో ప్రెసిడెంట్ జి.వి.రమణ, ట్రెజరర్ వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు

శృంగవరపుకోట: తమ సమస్యల పరిష్కారం కోసం 36 గంటలు సమ్మె చేయనున్నట్లు ఆశా వర్కర్లు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారికకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 14న ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 4గంటల వరకు విజయనగరంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట 36 గంటల పాటు ధర్నా, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ధర్నాలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లు అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బి.విమల, డి.పాపమ్మ, ఆర్.రమణమ్మ, టి.విజయ, ఆర్.శ్రావణి, ఎం.గౌరీశ్వరి, పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

చీపురుపల్లి: వేతనాలు పెంచాలని, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు.

గజపతినగరం: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. గజపతినగరం జాతీయ రహదారి మీదుగా అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ర్యాలీ, అనంతరం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

కొత్తవలస: కుమ్మరిబంజరి వద్ద ఉన్న సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేపట్టారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

బొండపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ సుగుణకరరావు సూచించారు. ఇటీవల కురిసిన తుపాను వర్షాలకు మురుగునీటి కాలువలతో పాటు, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్‌ను చల్లాలని సూచించారు.

బీమా నగదు అందజేత

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన నగరి సూరి అప్పారావు ఈనెల 9న మరణించడంతో ఆయన సతీమణి నగర సన్యాసమ్మకు వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ పైడపునాయులు అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొత్తవలస: మండలంలోని బలిఘట్టాం రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభిస్తారని సీఎస్‌డీటీ కె.ఇందిర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే లక్కవరపుకోట మండలం మార్లాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పీఆర్ జేఈ వీరలక్ష్మి తెలిపారు.

నేడు కొత్తపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిన్నంనాయుడు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

కుమ్మపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

వేపాడ: మండలంలో కుమ్మపల్లిలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజు ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 98 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు శిబిరంలో సేవలందించారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: గతంలో పంచాయతీ భవనం కావాలన్నా, పాఠశాలకు అదనపు తరగతి గది కావాలన్నా జిల్లా పరిషత్ చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండేది కాదు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ప్రభుత్వ శాఖకు పక్కా భవనాలను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉత్తరాపల్లి సచివాలయం పరిధి గాంధీనగరంలో రూ.7.5 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ.. గ్రామాలను సమూలంగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎంపీటీసీ ఎం.శివప్రసాద్, పార్టీ నాయకులు సింగంపల్లి గణేష్, మేలాస్త్రీ అప్పారావు, పల్లా భీష్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీపాట్ వినియోగంపై అవగాహన


ఈవీఎం, వీవీపాట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై ప్రతీ ఓటరు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ బి.శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం, వీవీపాట్ యంత్రాలపై రాజకీయ పార్టీలతో పాటు వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీపాట్ యంత్రాలు ద్వారా పారదర్శకంగా పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు తాము ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీపాట్ యంత్రంలో సరిచూసుకోవచ్చన్నారు. ఈవీఎంలపై ఓటు వేసే విధానంపై ప్రతీ ఓటరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రతిరోజూ ఈవీఎం, వీవీపాట్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ రామ్‌కుమార్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెంటాడ(గజపతినగరం రూరల్): ఎన్నికల్లో ఈవీఎంపై ఎలా ఓటు వేయాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలింగ్ ప్రక్రియపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈవీఎంపై ఎలా ఓటు వేయాలి, ఓటు ఎవరికి పడిందో వీవీపాట్‌లో ఎలా సరిచూసుకోవాలో వివరించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తాం..

• ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస: విశాఖపట్నం–అరకు ఎన్‌హెచ్ 516బీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ అన్నారు. మండలంలోని నిమ్మలపాలెం, దత్తి, వీరభద్రపురం రెవెన్యూ గ్రామాల రైతులతో నిమ్మలపాలెం సచివాలయం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రోడ్డు నిర్మాణానికి సబంధించి నోటిఫికేషన్ ఇచ్చిన నాటికి భూ మార్పిడి జరిగిన భూములకు గజాల లెక్కన పరిహారం అందజేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములకు ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందజేస్తామన్నారు. అలాగే నోటిఫికేసన్‌లో పేర్కొన భూములకు మార్కింగ్ చేశామని, అదనంగా మార్కింగ్ చేసిన భూములకు మరో నోటిఫికేషన్‌ను జారీ చేస్తామన్నారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ భూములకు మార్కెట్ విలువకు అదనంగా 30 శాతం పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయగా.. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, వారి ఆదేశాల మేరకు పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తమటపు రమేష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రసాదరావు, మండల సర్వేయర్ జి.గంగాధర్, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగవివక్షను వ్యతిరేకిద్దాం..


ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు

బొండపల్లి: లింగవివక్ష లేని సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని కనిమెరక గ్రామంలో మంగళవారం లింగవివక్షతకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు అనే బేధం లేకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుగుణకరరావు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.సత్యవతి, సర్పంచ్ సిరిపురం ఆదినారాయణ, కర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల్లో ఆశ కార్యకర్తలు కీలకం


ఆశా కార్యకర్తలకు చీరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: ప్రజారోగ్య కార్యక్రమాల్లో ఆశ కార్యకర్తలు క్రియాశీలకంగా వ్యవహరించాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి సూచించారు. పీహెచ్‌సీలో మంగళవారం 'ఆశ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆశా కార్యకర్తలకు చీరలు, పిల్లల సంరక్షణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగశ్వేత, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్ ప్రేమ్‌కుమార్, హెచ్‌వీ భవాని, వైద్య సిబ్బంది సత్యనారాయణ, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

వేపాడ: ఆశ వర్కర్లు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రోగ్రాం అధికారులు రవికుమార్, బి.మహాలక్ష్మి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. లింగ వివక్షతపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు నిర్వహించాల్సిన విధులను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.ధరణి, సీహెచ్ఓ ఆంజనేయులు పాల్గొన్నారు.